క్లుప్తంగా

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

వలేటివారిపాలెం: సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని జెడ్పీటీసీ ఇంటూరి భారతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పానుగోటి మౌనిక అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ భారతి మాట్లాడుతూ అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించకుండా అంకెల గారడీతో సమయం వృథా చేస్తున్నారన్నారు. రానున్న సమావేశానికైనా ప్రజల సమస్యలు 70 శాతమైనా పరిష్కరిస్తామని ఆశిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎంఈఓ రవికుమార్, ఏపీఓ షమీర్‌బాషా, ఏడీ బ్రహ్మయ్యలు వారి శాఖల నివేదికను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షేక్ రషీద్, తహసీల్దార్ సుందరమ్మ, ఏఓ హేమంత్ భరత్‌కుమార్, విద్యుత్ శాఖ ఏఈ మధుబాబు, పంచాయతీరాజ్ ఏఈ గోపిచంద్, ఆర్ఐ నరసమ్మ, సీడీపీఓ మాధవీలత, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం


భూమిని స్వాధీనం చేసుకుంటున్న ఎంపీడీఓ

వెలిగండ్ల: మండలంలోని మొగళ్లూరుపల్లిలో వాగుపోరంబోకు భూమిని ఎంపీడీఓ టి.సుకుమార్ మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో సర్వే నంబర్ 266లో 1.75 ఎకరాలు, 267లో 1.32 ఎకరాలు ఉంది. ఆ భూమి విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం కొన్ని రోజుల నుంచి నడుస్తోంది. ఈ విషయంపై కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ సూచనలను పాటిస్తూ ఎంపీడీఓ టి.సుకుమార్, సర్వేయర్ బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బి.కొండయ్యలు గ్రామం వెళ్లి సర్వే నం 266,267లోని భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా ఆ భూమిలోకి దిగితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

గుడ్లూరు: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆశాకార్యకర్తలు అప్రమత్తం చేయాలని వైద్యాధికారి మారుతీరావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి ఆశాకార్యకర్తలకు,వైద్య సిబ్బందికి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు సకాలంలో మందులు వేసుకునేలా చూడాలన్నారు. సీహెచ్ఓ భాస్కరరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత


బీమా నగదును అందచేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: వైఎస్సార్ బీమా పేదలకు వరంలాంటిదని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 7వ వార్డుకు చెందిన పిల్లి తిరుపతమ్మ మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున తక్షణ సాయంగా రూ.10 వేలను మట్టి ఖర్చులకు చైర్మన్ గఫార్ చేతుల మీదుగా మంగళవారం అందచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పేదవర్గాల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తరుపు నుంచి రావాల్సిన అన్ని పథకాలు, రాయితీలు అందజేసి ఆదుకుంటామన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


భోజనాన్ని రుచి చూస్తున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ

సీఎస్‌పురం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని రుచికంగా తయారు చేయాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక ఎస్టీ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఎంఈఓ జె.ప్రసాదరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ

టంగుటూరు: కాకుటూరివారిపాలెం మాజీ సర్పంచి తొట్టెంపూడి కొండయ్య వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లను వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సూదనగుంట శ్రీహరిరావు, సొసైటీ అధ్యక్షుడు రావూరి ప్రవీణ్‌కుమార్, బీసీడి ఉదయకుమార్, పైటి రాఘవయ్య, ఎంపీటీసీ నవనీతమ్మ, మాజీ మునసబు తొట్టెంపూడి ఆదినారాయణరావు, మాజీ ఎంపీటీసీ అద్దంకి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు మారుపేరు జగన్

- నూతన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు రూరల్: విశ్వసనీయత కలిగిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో కందుకూరు మండలం, అర్బన్ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల గుండెకు అండగా నిలవాలనే ఉద్దేశంతో వైఎస్సార్ పింఛన్ కానుకను జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారన్నారు. రూ.2వేల నుంచి పెంచుకుంటూ ఈ ఏడాది రూ.2750లు వరకు తీసుకొచ్చారు. కరోనాతో ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అందించిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గతంలో కందుకూరు మండలంలో 5657 మందికి పింఛన్లు వస్తుండగా అవి కాస్తా 6347 మందికి పెరిగిందన్నారు. గతంలో ఇచ్చిన నిబంధనలు మార్చి మరి కొంత మందిని అర్హుల జాబితాలో చేర్చామన్నారు. గతంలో ఐదు ఎకరాల కంటే తక్కువ ఉంటే అర్హులని, ప్రస్తుతం పది ఎకరాల వరకు నిబంధనలను మార్చారన్నారు. సంక్షేమ పథకాల్లో ఏటా అర్హుల జాబితాను పెంచుకుంటూ


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

పోవడమే తప్ప ఎక్కడ తగ్గించింది లేదన్నారు. డ్వాక్రా రుణాలు విడతల వారీగా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చినా ఎక్కడ కూడా రుణాలు చెల్లించవద్దని చెప్పలేదన్నారు. వ్యవస్థలను దెబ్బతీయకుండా డ్వాక్రా మహిళలు రుణాలు బ్యాంకుల చెల్లించడం, చెల్లించిన రుణాలను నాలుగు విడతల్లో నేరుగా మీ ఖాతాలో వేస్తానని చెప్పిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. కరోనా సమయంలో చైనా, అమెరికా వంటి దేశాల్లో తట్టుకోలేకపోయాయన్నారు. వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థలను తీసుకొచ్చి ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా గుర్తించి కరోనా మరణాలలో అన్ని రాష్ట్రాల కంటే మన రాష్ట్రం తక్కువ మరణ శాతం జాబితాలో ఉందన్నారు. కందుకూరు నియోజకవర్గ పరిశీలకుడు కె.కనకరావు మాట్లాడుతూ చెప్పింది చెప్పినట్లుగా చేసే ఏకైక నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. పాదయాత్రలో ప్రజల కష్టాలు స్వయంగా పరిశీలించిన తర్వాత ఇచ్చిన హామీలను మెనిఫెస్టోలో పెట్టి నేరవేర్చారన్నారు. ఎంపీడీఓ పి.వి జయశేఖర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి సుశీల, జెడ్పీటీసీ తొట్టెంపూడి అనసూర్య, డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ డి.సీతారామయ్య, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, సర్పంచ్, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పామూరు: వైఎస్సార్ పెన్షన్ కానుక పేదలకు వరంలాంటిదని ఎంపీపీ గంగసాని లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. నూతనంగా మంజూరైన పెన్షన్‌లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీడీఓ వి.శ్రీనివాసులు, ఈఓఆర్డీ బ్రహ్మానందరెడ్డి, వైస్ ఎంపీపీ రషీద్, ఏసురత్నం, సింగిల్‌విండో చైర్మన్ పువ్వాడి వెంకట సుజాత, యాదాల సాయికిరణ్, కో ఆప్షన్ నాయబ్‌రసూల్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: నూతనంగా మంజూరైన పింఛన్లను ఎంపీడీఓ రమణారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బొగ్గరారెడ్డి, సర్పంచ్ మరియమ్మ, మారెళ్ల సర్పంచ్ పరిమి వెంకట్రావ్, పంచాయతీ కార్యదర్శి చాంద్‌బాషా పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


టంగుటూరులో నూతన పింఛన్లు అందిస్తున్న వరికూటి అశోక్‌బాబు

- వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుల, మత, పార్టీ భేదం లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. జగనన్న ఇచ్చిన హామీ మేరకు రూ.2500 పింఛనును రూ.2750కు పెంచారన్నారు. పింఛన్లలో కోత విధిస్తున్నారని దుష్టచతుష్టయం గగ్గోలు పెడుతోందని, అయితే మండలంలో గత నెల కంటే 351 మందికి అధికంగా పింఛన్లు వచ్చాయన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి చంద్రబాబు తిట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. జగనన్న బహిరంగ సభలకు లక్షల మంది వచ్చినా ఎక్కడా పొరపాటు జరగలేదన్నారు. కానీ చంద్రబాబు కందుకూరు సభలో 8 మందిని, గుంటూరులో ముగ్గురిని ప్రచార పిచ్చితో బలిగొన్నాడని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, ఎంపీడీఓ అజిత, ఈఓఆర్డీ నర్రా జగదీష్‌బాబు, కొండపి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి హరిబాబు, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, బీసీడి ఉదయకుమార్, ఎంపీటీసీలు ప్రభుదాసు, బొడ్డు వాసంతి, కోటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ ఉప్పలపాటి నాగరాజు, ల్యాబు రమణయ్య, టంగుటూరి రామకృష్ణ, జి.సునీత, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సింగరాయకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పలువురు లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటి వరకు 8,920 పింఛన్లు ఉండగా ఈ ఏడాది 287 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కార్యక్రమాలన్నీ చెత్తవని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కట్టా శోభారాణి, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్ రెడ్డి, సర్పంచ్ తాటిపర్తి వనజ, ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, డీటీ వెంకటేశ్వరరావు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, షేక్ పటేల్, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


మాలపాడులో పింఛను అందజేస్తున్న ఎంపీపీ మాధవరావు, నాయకులు

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు

పొన్నలూరు: అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు పేర్కొన్నారు. మండలంలోని మాలపాడు సచివాలయం పరిధిలో కొత్తగా మంజూరైన 15 పింఛన్లను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో మళ్లీ ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరిగిరి శ్రీదేవి, సిరిగిరి గోపాల్‌రెడ్డి, వరికూటి ఆంజనేయులు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి


సావిత్రిబాయ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే


విప్పగుంటలో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు


కందుకూరులో సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాతసింగరాయకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పీఎస్‌సీపీ డిగ్రీ కాలేజీలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. మహిళా విద్యకు సావిత్రిబాయి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ప్రధానోపాధ్యాయుడు బి గోవిందయ్య, పీఎస్‌సీపీ కాలేజి కరస్పాండెంట్ గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

■ **మర్రిపూడి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సావిత్రిబాయి చిత్రపటానికి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ఎంపీడీఓ ఎస్.సుదీపా పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం వెంకటరెడ్డి మాట్లాడుతూ.. బాలికలు చదువుకుని సావిత్రిబాయి ఆశయాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఎస్కే నాగూర్‌వలి, మాచేపల్లి నాగయ్య, కోండ్రు ఇజ్రాయిల్, ఏఈ జాలయ్య, గురిజాల చిన్నారి, జి.శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి జయంతి

■ **పొన్నలూరు:** మండలంలోని విప్పగుంట జెడ్పీ పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి ఎంఈఓ రవిచంద్రబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. సావిత్రిబాయి తన అభ్యుదయ భావాలతో దేశ మహిళలకు ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.శివరామకృష్ణ, సీఆర్పీలు మధుబాబు, మోహన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ **గుడ్లూరు:** విద్యా విప్లవానికి బాటలు వేసిన సామాజిక సంఘసంస్కర్త సావిత్రి భాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.సులోచన, ఉపాధ్యాయులు సావిత్రి భాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. పీడీ జీవన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ **లింగసముద్రం:** సావిత్రి భాయి పూలే జయంతిని స్థానిక ఎంపీపీఎస్ సౌత్ పాఠశాలలో హెచ్ఎం సుధాకర్‌రావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఎం.రాధను సన్మానించారు.

■ **కందుకూరు అర్బన్:** భారతదేశ తొలి ఉపాధ్యాయిని సాయిత్రీబాయి పూలే అని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఎస్కే ఫీ, న్యాయవాది ముప్పవరపు కిషోర్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సావిత్రి భాయి పూలే జయంతిని నిర్వహించారు. జనార్దనస్వామి దేవాలయం చైర్మన్ రావులకొల్లు బ్రహ్మనందం, వెంకటస్వామి, నగళ్లనారయ్య, ప్రభాకరరావు, రహీం, కామాక్షినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు ముప్పవరపు కిషోర్ సహకారంతో చనమాల కోటేశ్వరరావు బృందావనంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

■ **ఉలవపాడు:** సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని స్థానిక వడ్డెరపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో నివాళులర్పించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఇందిరాదేవి, నాయకులు కోటేశ్వరమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

మహనీయురాలు సావిత్రిబాయి పూలే

కందుకూరు రూరల్: విద్య అవశ్యకతను సమాజానికి తెలియజేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోవూరు సచివాలయంలో సావిత్రి బాయ్ పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూఢాచారాలను తరిమికొడుతూ మహిళలకు విద్య పట్ల సంపూర్ణ అవగాహన కలిగే విధంగా చేసిన సావిత్రి బాయి పూలే అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. మొదటి మహిళా ఉపాధ్యాయురాలు నుంచి మహిళలు కీలక పాత్ర పోషించే దిశగా ఆమె వేసిన అడుగులు ఈ రోజు మహిళా విప్లవానికి దారితీసిందన్నారు. అనేక మంది మహిళలు ఉద్యోగ, విద్య రంగంలో ఉన్నారంటే దానికి కారణం సావిత్రిబాయి పూలేనన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆవుల మాధవరావు, ఎంపీడీఓ పి.విజయశేఖర్, కొండూరి వసంతరావు, కార్యదర్శి స్వప్న, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎస్‌పురం: సావిత్రిబాయి పూలే సేవలు శ్లాఘనీయమని పెదరాజుపాలెం సర్పంచ్ పందిళ్ల నాగమణి అన్నారు. మండలంలోని పెదరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ ప్రభావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పామూరు: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సావిత్రిబాపూలే జయంతిని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, ప్రజాసంఘాల నాయకులు బద్దిపూడి మార్కు, వైస్ ఎంపీపీ రషీద్, కోఆప్షన్ నాయబ్‌రసూల్, యాదాల వెంకట సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు. కేజీబీవీలో ఎస్ఓ మండ్లా శైలజ అధ్యక్షతన పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హనుమంతునిపాడు: సావిత్రి బాయిపూలే జయంతి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. హెచ్ఎం సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని రామగోపాలపురం ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ సురేష్‌బాబు, ఎంఈఓ దాసు ప్రసాద్‌లు నివాళులర్పించారు.


మర్రిపూడిలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు


సింగరాయకొండ : ఊళ్లపాలెంలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వినికిడి యంత్రం పంపిణీ

టంగుటూరు: మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన ఉప్పలపాటి గోపాలకృష్ణకు జరుగుమల్లి మండలం చతుకుమాడులో మంగళవారం వరికూటి అశోక్‌బాబు చేతులమీదుగా వినికిడి యంత్రాన్ని అందజేశారు. ఇటీవల గోపాలకృష్ణ చేసిన విజ్ఞప్తి మేరకు జిల్లా అధికారులతో మాట్లాడి వినికిడి యంత్రం మంజూరు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు, సొసైటీ డైరెక్టర్ నాగరాజు, ఎంపీటీసీలు కసుకుర్తి కొటేశ్వరరావు, ప్రభుదాసు, దాసరి సుబ్బారావు, నర్రా శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు మన్నం వెంకయ్య పాల్గొన్నారు.


వినికిడి యంత్రం అందస్తున్న అశోక్‌బాబు

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవం


త్యాగరాజస్వామి చిత్రపటంతో ఉత్సవం

పామూరు: ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి 175 ఆరాధన మహోత్సవం నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. త్యాగరాజస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి మేళతాళాలతో స్థానిక సత్యనారాయణస్వామి దేవస్థానం నుండి మదన వేణుగోపాలస్వామి దేవస్థానం వరకు ఉత్సవం నిర్వహించారు. మాట్లాడుతూ త్యాగరాజస్వామిని నేటి వాగ్గేయకారులు గురువుగా భావించి ఆయన మార్గాన్ని అనుసరించాలన్నారు. నాయీబ్రాహ్మణ సేవా సంఘ రాష్ట్ర కార్యదర్శి రాగిపాటి సుధాకర్, మండల అధ్యక్షుడు పశుపులేటి మస్తాన్, జిల్లా కమిటీ, మండల కమిటీ సభ్యులు, నాయీబ్రాహ్మణులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అంచనా మేరకు పరిహారం చెల్లింపు

సీఎస్‌పురం: గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అంచనాల మేరకు నష్ట పరిహారం చెల్లించనున్నట్లు ఆర్డీఓ సందీప్‌కుమార్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కిషోర్ ఆదేశాల మేరకు బీకేవీ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం మండలంలోని కె.అగ్రహారంలో గ్రామసభ నిర్వహించారు. ఎకరాకు రూ.4,77,638 వంతున నష్టపరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ ఎ బాలకిషోర్, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సందీప్‌కుమార్

సంక్షిప్తంగా

లాభదాయకంగా పశుపోషణ

- పశుసంవర్ధ శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి


టంగుటూరు పశువైద్యశాలను తనిఖీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి

సింగరాయకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా రైతులకు అధిక లాభాలు సమకూరుతున్నాయని పశుసంవర్ధ శాఖ జేడీ డాక్టర్ కె.బేబీరాణి పేర్కొన్నారు. మండలంలోని పాకల పశువైద్యశాలను, పాల వెల్లువ కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు. డాక్టర్ బేబీరాణి మాట్లాడుతూ.. ప్రభుత్వం పశుపోషకులకు సబ్సిడీపై అందిస్తున్న టీఎంఆర్, చాప్ కట్టర్, గడ్డి విత్తనాలు, మినరల్ మిక్చర్ ఉపయోగించుకుని అధిక పాల దిగుబడి సాధించాలని సూచించారు. అనంతరం పశుపోషకులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందజేశారు. పశువైద్యాధికారి ఆర్.పేరయ్య, సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, ఎంపీటీసీ జి అశోక్‌కుమార్ రెడ్డి, ఏపూరి శ్రీనివాసులు, కేశవరపు కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ చేయూతతో రైతులకు లబ్ధి

టంగుటూరు: వైఎస్సార్ చేయూత పథకం వల్ల ఎక్కువ మంది రైతులు లబ్ధి పొందేలా చూడాలని పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి ఆదేశించారు. స్థానిక పశువైద్యశాలను జేడీ మంగళవారం తనిఖీ చేశారు. పశుపోషకులకు సబ్సిడిపై టీఎమ్ఆర్, కిసాన్ క్రెడిట్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సుధీర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

టంగుటూరు: సింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్-14 విభాగంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో టంగుటూరు బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఎ.అశోక్, ఎస్.శ్రీను ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాజారావు తెలిపారు. వీరు జనవరి 20, 21, 22 తేదీల్లో కర్నూలు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పీఈటీ వెంకట్రావు, ఉపాధ్యాయులు జె.రంగస్వామి తదితరులు అభినందించారు.

మార్కెట్ ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని సమీకృత మార్కెట్ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. పదో వార్డు పరిధిలోని సుదర్శన్ మహల్ సమీపంలో గల రైస్ మిల్లు పక్కన గల ప్రభుత్వ స్థలాన్ని మంగళవారం చైర్మన్ గఫార్, కౌన్సిలర్ దాసరి మురళీలు స్థల పరిశీలన చేశారు. రైస్ మిల్లు వద్ద పెద్ద కాలువ పక్కన ఉన్న అర ఎకరా ప్రభుత్వ స్థలంలో చేపల, మటన్, చికెన్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పట్టణ ప్రగతి నిధులతో సమీకృత మార్కెట్ ఏర్పాటుకు త్వరలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దాసరి మురళీ, కన్వీనర్ ఎస్ఎన్ రసూల్, శానటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన డాక్టర్ బత్తుల


సీఎంకు శుభలేఖ అందజేస్తున్న డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ వైద్య విభాగం ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి తన రెండో కుమార్తె సాయి శివాని, రోహిత్‌ల వివాహానికి ఆహ్వానించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో మంగళవారం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో వెళ్లి కలిశారు. ఈనెల 27వ తేదీన నెల్లూరులో జరిగే వివాహ మహోత్సవానికి హాజరు కావాలని సీఎం వైఎస్ జగన్‌ను డాక్టర్ బత్తుల శుభలేఖ అందజేశారు. ఫిబ్రవరి మొదటి వారంలో సింగరాయకొండలో రిసెప్షన్‌కు హాజరవుతానని సీఎం తెలియజేశారని, అదే రోజు జాతీయ రహదారి పక్కన తాను నిర్మిస్తున్న వైఎస్సార్ ఆర్చిని కూడా సీఎం ప్రారంభిస్తారని వివరించారు.

బైకు అదుపుతప్పి గాయాలు


గాయపడిన తన్నీరు రాజు

ఉలవపాడు: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పడిపోవడంతో వాహనం నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని జాతీయరహదారిపై కరేడు ర్యాంపు సమీపంలోని వేరు వెంకటేశ్వర స్వామి గుడి వద్ద జరిగింది. సింగరాయకొండ మండలం శానంపూడికి చెందిన తన్నీరు రాజు ఉలవపాడు నుంచి సింగరాయకొండ కు వెళ్తున్న సమయంలో అదుపుతప్పి పడిపోయింది. గాయపడిన వ్యక్తిని 108 సిబ్బంది ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణుల వివరాలు ఆన్‌లైన్ చేయండి


మాట్లాడుతున్న సీనియర్ మెడికల్ అధికారి సరస్వతి

సింగరాయకొండ: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సీనియర్ మెడికల్ అధికారి, జరుగుమల్లి మండల వైద్యాధికారి సీహెచ్ సరస్వతి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలతో ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. డాక్టర్ సరస్వతి మాట్లాడుతూ.. గ్రామాల్లో అనారోగ్యానికి గురైన వారిని గుర్తించాలని సూచించారు. కొత్తరకం వ్యాధులు ప్రబలుతుంటే ప్రజలను వెంటనే అప్రమత్తం చేయాలని చెప్పారు. డాక్టర్ చైతన్యకృష్ణ, సీహెచ్ఓ సోమేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.